ఊరూరా ఏరువాక సంబురం

- అలరించిన ఎద్దుల ఊరేగింపు
- ఆకట్టుకున్న తాడు తెంచే ఉత్సవం
- మొక్కులు సమర్పించుకున్న భక్తులు

గద్వాల టౌన్, జూన్ 22 : నడిగడ్డలో రైతులు ఏరువాక సాగు పండుగను జిల్లా కేంద్రంలో రైతులు, ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం పండుగను పురస్కరించుకొని ఉదయాన్నే కాడెద్దులకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ దేవతలైన ఈదమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భూలక్ష్మీచెన్నకేశవస్వామి, గుంటి చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో రైతన్నలు ప్రత్యేక పూజలు చేసి తమను, పాడి పంటలు, పశువులను చల్లంగా చూడాలని వేడుకున్నారు. రైతన్నలు తమ ఎద్దులను అందంగా అలంకరించారు. చింతలపేటలోని తాడు తెంచే ఉత్సవాలు రైతన్నలకు నూతన ఉత్సాహాన్ని నింపాయి. అలాగే జములమ్మ అమ్మవారి సన్నిధిలో అన్నదానం నిర్వహించారు.

గద్వాల : బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గద్వాలలో ఉత్సాహంగా ఏరువాక తాడు తెంచే ఉత్సవంలో ప్రజలు

అయిజలో..

అయిజ, జూన్ 22 : పట్టణంతో పాటు మండలంలోని పలు పల్లెల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు నడిగడ్డ ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. శనివారం గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామ చావిడిల దగ్గర ఎడ్లను ఊరేగించిన రైతులు చెర్నకోలలతో తోరణాలను తెంపి సంబురపడిపోయారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

అయిజ రూరల్, జూన్ 22 : మండలంలోని ఈడిగోని పల్లి, తూంకుంట, కిష్టాపురం, బింగిదొడ్డి, సీటీపాడు, కేశవరం, వేణిసోంపురం, వెంకటాపురం, యాపదిన్నెలో గ్రామదేవతలకు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకొన్నారు. సాయంత్రం ఎద్దుల పరుగుపందెం నిర్వహించారు. అనంతరం గెలుపొందిన బీఆర్ఎస్ నాయకుడు గోపి వారికి బహుమతులు అందజేశారు.

ఆలయాల్లో రద్దీ..

మల్దకల్, జూన్ 22: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఏరువాక పండుగను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భం గా సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, ఈదమ్మ, సవారమ్మ తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కేటీదొడ్డి మండలంలో..

కేటిదొడ్డి, జూన్ 22: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు చుకున్నారు. ఆలయాల్లో స్వామివారికి అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

గట్టు మండలంలో..

గట్టు, జూన్ 22: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో గ్రామదేవతలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, జూన్ 22 : మండలంలోని ఆయాగ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో స్వామివారికి అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మానవపాడు మండలంలో

మానవపాడు, జూన్ 22 : మండలంలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలు చేశారు. పొలాలకు వెళ్లి పూజలు చేసి విత్తనాలు నాటారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా షేక్‌పల్లిలో ఆడపడుచులు సుంకులమ్మకు బోనాలు సమర్పించారు.

గద్వాలలో ఎద్దుల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గట్టులో ఎడ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

మల్దకల్‌లో సుంకులమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అంబేద్కర్ ఆశయాలు అనుసరణీయం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

సూగూరు వద్ద వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

పెబ్బేరు, జూన్ 22: అంబేద్కర్ ఆశయాలను అందరూ అనుసరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెబ్బేరులో 40మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి, మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. అలాగే, సూగూరులో రూ.2.40కోట్లతో నిర్మించిన హైలెవల్ వంతెనను ప్రారంభించి, అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే దేశంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ పెద్దింటి పద్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, తాసీల్దారు లక్ష్మి, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

మున్సిపాలిటీలో చేపడుతున్న, ఆగిపోయిన అభివృద్ధి పనులను కొనసాగించాలని పాలకవర్గం మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం పెబ్బేరుకు వచ్చిన ఆయనను చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు కలిసి వినతిపత్రం సమర్పించారు. వనపర్తి రోడ్డు వెడల్పుకు రూ.2.80 కోట్లకు టెండర్ అయినా ప్రభుత్వం ఏర్పడి 8నెలలు కావొస్తున్నా ఇంతవరకు అగ్రిమెంటు కాలేదన్నారు. వివాదంలో ఉన్న సంత స్థలాన్ని పరిష్కరించాలని, రోడ్ల విస్తరణలో ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూంలు, పాక్షికంగా కోల్పోయిన వారికి ప్లాట్లను అందించాలని కోరారు. ఎమ్మెల్యే మేఘారెడ్డితో మాట్లాడుతూ.. సంత స్థలం విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రణాళికాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వినతిపత్రం సమర్పించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, జూన్ 22 : అయిజ మున్సిపల్ వైస్‌చైర్మన్ నర్సింహులు సోదరుడు మునిస్వామి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం పట్టణంలోని వైస్ చైర్మన్ ఇంటికి చేరుకుని మృతుడి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ దేవన్న, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నాయకులకు సమస్యలను వివరిస్తున్న కాలనీ వాసులు

మదనాపురం, జూన్ 22: మండల కేంద్రానికి సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 132 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అర్హులైన పేదలకు అందజేసినా, అక్కడ నివసిస్తున్న వారి కష్టాలు వర్ణణాతీతమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. శనివారం మండల నాయకులతో కలిసి డబుల్‌బెడ్రూం కాలనీలో పర్యటించారు. స్థానికుల కష్టాలను సీపీఎం నాయకులకు వివరించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వివరించారు. మురు గు నీరురోడ్లపైన పారుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, అధికారులు స్పందించి వసతులు ఉల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శనివారం నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ సరస్వతీ,వారిమిత్రులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు

ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నిస్తే చర్యలు

అమరచింత, జూన్ 22: ప్రభుత్వ అధీనంలో ఉన్న అసైన్డ్, వక్ఫ్ బోర్డు భూములను కబ్జా చేసేందుకు ఎవరైనా ప్రయత్నం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ షేక్‌చంద్‌పాషా హెచ్చరించారు. శనవారం ఆయన మండల సర్వేయర్ పాండు, ఆర్ఐ గోపాల్‌తో కలిసి మండలంలోని ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు పరిధిలోని భూములను రికార్డుల క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

అడ్మిషన్ల పెంపునకు కృషిచేయాలి

ఆత్మకూరు, జూన్ 22: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్ల పెంపునకు కృషిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలేటి కోరారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో సమావేశమైన ఆయన విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్మిషన్లను పెంచాలన్నారు. అంతకుముందు కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు, అధ్యాపకులు విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా 25న

గద్వాల, జూన్ 22: జిల్లా కేంద్రంలోని వ్యవసాయమార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఐటీసీ లిమిటెడ్, మనోహరాబాబ్ మేడ్చల్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఒకేషనల్ కోర్సులు పాస్లై 18నుంచి 28 ఏండ్ల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, గద్వాల ఐటీఐలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9110523925,8341441763ను సంప్రదించాలని కోరారు.

25న తైబజార్ వేలం

వనపర్తి, జూన్ 22: మున్సిపాలిటీ పరిధిలో 2024-25 సంవత్సరానికిగానూ తైబజార్ వేలం ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పూర్ణచందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. రోజువారీ మార్కెట్, పశువుల వారాంతపు సంత తదితర వాటికి వేలం ఉంటుందన్నారు.

టీడీఎఫ్ఏ సేవలు అభినందనీయం

మల్దకల్, జూన్ 22: తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం మెరికా సేవలు అభినందనీయమని ఎంఈవో సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలు డీఈవో ఇందిర సమక్షంలో ఫోరం ప్రతినిధి మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు నరేశ్, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్స్ వితరణ

ఖిల్లాఘణపురం, జూన్ 22: మండలంలోని సోలీపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఆలయ పూజారి, వేద పండితుడు జ్యోతి గోపాలశర్మ విద్యార్థులు కూర్చునేందుకు టేబుల్స్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా గోపాలశర్మ మాట్లాడుతూ.. రూ.70వేల విలువవైన టేబుల్స్‌ను వితరణ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

పాన్‌గల్, జూన్ 22: మండలకేంద్రంలోని తాసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి కుర్మయ్య శనివారం ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

చిన్నంబావి, జూన్ 22: మండలంలోని వెల్టూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శనివారం విద్యుత్ శాఖ ఏఈ అప్పలనాయుడుతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తాం

- 24గంటలు అందుబాటులో పోలీసులు
- చోరీల నియంత్రణకు పూర్తిస్థాయి నిఘా
- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాస రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జూన్ 22: జిల్లా ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో ప్రజాసమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిధిలోని సామాన్యుడిని దృష్టిలో ఉంచుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందని, శాంతిభద్రతల విషయంలోనూ కఠినంగా ఉంటామని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళలు రక్షణ కోసం, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. దొంగతనాల నియంత్రణకు జిల్లాలో అధిక మొత్తంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక నిఘా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చొరవ తీసుకుంటామని, చెడు పనులను ఎవరూ ప్రోత్సహించినా ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- గద్వాల నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభం

పాదయాత్రను ప్రారంభిస్తున్న జి.చిన్నారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు

అలంపూర్, జూన్ 22 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం స్నేక్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ కృష్ణసాగర్ ఆధ్వర్యంలో అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్రను చిన్నారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కాగా ఫౌండర్ కృష్ణ సాగర్ మాట్లాడుతూ అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు రహదారి పొడవునా ప్రతి కిలో మీటరుకు 2 మొక్కలు చొప్పున నాటనున్నామన్నారు. కార్యక్రమంలోకార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారెడ్డి జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు.

పథకాలు సక్రమంగా అందేలా చూడాలి

పెబ్బేరు, జూన్ 22: ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన పెబ్బేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ ఆవుల శైలజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పెద్దింటి పద్మ, ఎంపీడీవో రవీంద్ర, తాసీల్దారు లక్షి పాల్గొన్నారు.

ఎన్‌టీఏను రద్దు చేయాలి

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 22: నీట్ గ్రేస్ మార్కులు రద్దు చేయడం కాదని ఎన్‌టీఏను పూర్తిగా రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నీట్ గందరగోళంపై కేంద్ర గ్రేస్ మార్కులు పొందిన వారి మార్కులు మాత్రమే రద్దు చేసి జూన్ 23న రీ-ఎగ్జామ్ నిర్వహించి, జూన్ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్, సాయి, చరణ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- కమాండెంట్ సాంబయ్య

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 22 : క్రీడలతో మానసిక ఉల్లాసానిస్తాయని పదోపటాలం కమాండెంట్ సాంబయ్య అన్నారు. మండలంలోని పదోపటాలంలో శనివారం కమాండెంట్ ఆధ్వర్యంలో బెటాలియన్ స్పోర్ట్స్‌మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడుతూ మొత్తం ట్రైనీకానిస్టేబుల్స్, పోలీసుసిబ్బంది, ఆఫీసర్స్ పాల్గొన్నారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయ న్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, ఆర్ఐలు, రాజారావు, వేంకటేశ్వర్లు, ఆర్‌పీసింగ్, గోపాల్, సయ్యద్‌బాషా, సుధీర్, శ్రీశైలం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గది సీజ్

అయిజ, జూన్ 22 : పట్టణంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలోని ఓ గదిని ఎమ్మార్సీ సిబ్బంది సీజ్ చేశారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన పీడీఎస్‌యూ నాయకులు నోట్‌పుస్తకాలు విక్రయిస్తున్నారని గ్రహించి ఎంఈవో నర్సింహులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంఈవో ఆదేశాల మేరకు పాఠశాలకు వెళ్లిన ఎమ్మార్సీ సిబ్బంది యాజమాన్యంను ఫోన్‌లో సంప్రదించారు. ప్రస్తుతం నేను అందుబాటులో లేనని, రెండు రోజుల్లో పాఠశాలకు వచ్చి గదితాళాలు తీసి చూపిస్తానని చెప్పడంతో చేసేదిలేక సిబ్బంది గదిని సీజ్ చేశారు. విషయమై ఎంఈవో శనివారం సంప్రదించగా, శుక్ర వారం గీతాంజలి పాఠశాలలోని ఓ గదిని సీజ్ చేసిన మాట వాస్తవమే అన్నారు. సోమవారం సీజ్‌చేసిన గదిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని చెప్పారు.

కల్యాణం కమనీయం

మల్దకల్, జూన్ 22: మండల కేంద్రంలో వెలిసిన స్వయంభు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం అర్చకులు రమేషాచార్యులు, రవిచారి, నాగరాజాచారి, ధీరేంద్రదాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, వెంకోబరావు, బాబురావు పాల్గొన్నారు.

దత్తకోటిలింగేశ్వర ఆలయంలో..

కొత్తకోట, జూన్ 22: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ఉన్న దత్తకోటిలింగేశ్వర ఆలయంలో సప్తమాదిశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. శివలింగానికి ఏకరుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కొత్తకోట, జూన్ 22: కలెక్టర్‌గా ఆదర్శ్ సురభి బాధ్యతలను చేపట్టిన తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ శనివారం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. వారివెంట రవీందర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కొత్తకోట, జూన్ 22: పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని శనివారం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా గిరి, కార్యదర్శిగా రాకేశ్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా అలీ, జిల్లా కమిటీ సభ్యులుగా శ్రావణి, పూజిత, వెన్నెల, మౌనికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు

ఉరేసుకొని ఉద్యోగి ఆత్మహత్య

ఉండవెల్లి, జూన్ 22 : ఉరేసుకొని పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పుల్లూరు టోల్‌గేట్ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు జిల్లా కొడుమూరు మండలం ముడుమలగుర్తికి చెందిన గొల్లమల్లికార్జున్ (41) కర్నూలులో తపాలాశాఖలలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యులకు చూపించిన నయం కాకపోవడంతో పుల్లూరు టోల్‌గేట్ వాగు దగ్గర చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు భార్యకు వాట్సాప్ ద్వారా లోకేషన్ పంపించాడు. కుటుంబసభ్యుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని కర్నూల్ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డు గ్రహీతకు సన్మానం

వనపర్తి టౌన్, జూన్ 22: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థి నిఖిల్ కుమార్‌ను శనివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ.. ఆత్మకూర్ మండలంలోని తిప్పుడంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి గోరుంట్ల నిఖిల్ కుమార్ స్మార్ట్ బ్యాండేజీని రూపొందించి ఆన్‌లైన్ పద్ధతిలో జిల్లాస్థాయిలో ఇన్‌స్పైర్ పోటీలు నిర్వహించగా.. రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, ఈ డివైజ్ రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహేశ్, సెక్రోరియల్ అధికారులు మహానంది, యుగంధర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

పాన్‌గల్, జూన్ 22: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం దవాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించి తనిఖీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఉద్యోగ అవకాశం

★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

HOUSE FOR SALE

★INDEPENDENT HOUSE FOR SALE AT YENUGONDA, G+1 . 150 Sq.Yrds., Prime location, secure neighborhood, all the essential amenities located nearby. Price : 1 crore, Contact : 9966698792, 9505506523.
NT- MBNR

WANTED

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజి